కథానిక

# ఉచిత వైద్యం

"సాగర్"

ఆనాడు ఆదివారం కావటంమూలాన నాకు కొంచెం తీరిక చిక్కింది. మిత్రుడు సుబ్బారావు హైదరాబాదునుంచి వచ్చాడని తెలీటంచేత, కాఫీ త్రాగి వాడింటివైపు వెళ్ళాను. సుబ్బారావు హైదరాబాదులో యేదో ఉద్యోగం చేసుకొంటూ, వందరూపాయలు తెచ్చుకొంటున్నాడు.

సుబ్బారావూ, నేనూ బాల్య స్నేహితులం. సుబ్బారావింటిదగ్గరనే ఉన్నాడు. నన్ను చూడగానే "ఏంరోయ్ చంద్రం?" అంటూ సంబరపడిపోయాడు. వాణ్ణి ఆఖరిసారి చూసి రెండు సంవత్సరాలయి ఉంటుంది. వాడు నన్ను చూసి ఎంతో సంతోషపడ్డాడు. వాడు భార్య సీతను కేకేసి, కాఫీ పట్టుకురమ్మన్నాడు, త్రాగొచ్చానురా అని చెప్తున్నా వినక.

సీత కాఫీ పట్టుకొచ్చింది. సీత అదివరకులాగ లేదు. చాలా చిక్కిపోయింది.

"ఏంరా సుబ్బారావు? మా చెల్లాయి మరీ అట్లా చిక్కిపోయిందేరా?" అన్నాను.

"అదీమధ్య చాలా జబ్బుపడింది. యెట్లాగో భగవంతుని దయవల్ల బ్రతికి బట్టకడుతున్నది" అన్నాడు సుబ్బారావు.

"అట్లాగా పాపం! మరి నాకు ఉత్తరం ముక్కన్నా వ్రాసేవుకాదేంరా?" అన్నా నేను.

"ఆ జబ్బులో మహ అవస్థపడిపోయాననుకో"

"ఇంటిదగ్గరే డాక్టరుని పెట్టి మందిప్పించావా?"

"అదేమిటిరా నా తాహతు తెలిసి గూడా అట్లా అడుగుతావు? ప్రైవేటు డాక్టర్ని పెట్టుకోటానికి మనకేం బ్యాంకులో నిల్వలున్నాయి గనుకనా. అక్కడ గవర్నమెంటు ఆస్పత్రిలో చేర్పించి నానా యాతనపడ్డాను. అయినా ఆస్పత్రిలో నుంచి బయటపడిన తర్వాత ప్రైవేటు డాక్టర్ను పెట్టుకొంటేనే నయమనిపించిందిలే" అన్నాడు సుబ్బారావు.

"ఏం? అలా అంటున్నావు?"

"ఆఁ. ఏముంది. ఆస్పత్రిలో ఓ నెలరోజులున్నామనుకో. వందరూపాయలు ఖర్చయింది. ఆవందా ప్రైవేటు డాక్టరకిస్తే నిక్షేపంలా ఇంటికొచ్చి ట్రీటుమెంటు ఇచ్చేవాడు."

"ఎట్లా అయినా గవర్నమెంటు ఆస్పత్రి వైద్యానికిన్నీ, ప్రైవేటుడాక్టరువైద్యానికీ తేడా లేదుటరా? ఎట్లయినా హాస్పిటలు హాస్పిటలే!"

"నేనూ అట్లాగనుకొనే మీ చెల్లెలిని ఆస్పత్రిలో ప్రవేశబెట్టాను. కాని ఇప్పుడు బాగా తెలిసొచ్చిందిలే."

"నువ్వెన్నన్నా నేనొప్పుకోనురా. ఆస్పత్రిలో ఎంతమంది డాక్టర్లు, ఎంతమంది నర్సులు, ఎంతమంది కాంపౌండర్లు? అసలు ఆస్పత్రిలో ఆ మంచంమీద పడుకొంటేనే రోగం తగ్గిపోతుంది. ఆస్పత్రి స్టోరులో ఎన్నిమందులూ, ఎన్ని అద్భుతమైన ఇంజక్షనులూ" అన్నా నేను.

"అవునటే నీకూడా నాలాగా అనుభవం ఐతేనేగాని తెలిసిరాదురా!" అన్నాడు చివరికి సుబ్బారావు.

గవర్నమెంటు ఆస్పత్రి వైద్యాన్ని యింత తేలికగా తీసెయ్యటం నాకు మహాకష్టం కలిగించింది. అసలు రోగులకు యేవైద్యం జరక్కపోతేనూ ప్రభుత్వం ఇన్ని ఆస్పత్రులను గుడ్డిగా నడుపుతున్నదా? ఇంతడబ్బు వృధాగా ఖర్చుపెడుతుందా? అప్పుడప్పుడు పత్రికలలో ప్రభుత్వపు ఆస్పత్రులనుగురించీ, అందులోని ఉద్యోగులనుగురించీ, పడే పొగడ్తలన్నీ సత్యదూరమైనవేనా?

నేను సుబ్బారావును తనకు ఆస్పత్రి అంటే ఎందుకు అసహ్యమూ, భయమూ వేసిందో, మందు ఖర్చూ, డాక్టరు ఫీజు ఖర్చూ, లేకపోయినా, తనకి వందరూపాయలు ఎందుకు ఖర్చయిందో చెప్పమని గుచ్చి అడిగాను.

సుబ్బారావు చెప్పుకొచ్చాడు.

"చూడగా, చూడగా ఈ ఆస్పత్రులన్నీ

ప్రభుత్వం మనకోసం కాదేమో ఏర్పరచింది అనిపిస్తున్నది. పెద్దపెద్ద సర్కారుద్యోగులకు, ధనవంతులకు తప్ప మనకు వైద్యం జరిగే అవకాశం లేదా? అని తోస్తుంది. సీతకు జ్వరం మొదలు పెట్టిన మూడోరోజు ఆస్పత్రికి తీసుకెళ్ళాను. సరే లేడీడాక్టరు చూసి, కేసు అడ్మిటుచేయించండి అని చెప్పింది. 'ఆయనెవరో పేరూ అదీ అడిగి రిజిష్టరులో వ్రాసుకున్నాడు. మామూలు రూపాయి ఇయ్యందే వదలిపెట్టలేదాయన."

"అదికాదురా నువ్వు డాక్టరుతో చెప్పకపోయినావా ఇట్లా మామూలు అడుగుతున్నాడని" అన్నా నేను.

"ఒక చెంపమీ చెల్లెలు రోగంతో బాధపడుతూ నిల్చోలేకుండా వుంటే, ఆయనతో రూపాయకోసం పేచీపెట్టుకుంటే వ్యవహారం ఎలా జరుగుతుంది రా? అయినా అప్పటి పరిస్థితిలో ఒక రూపాయిపోతే పోయిందిలే అనిపించింది. సరే ఆడవాళ్ళ వార్డులో ఒక బెడ్ ఇచ్చారు. ఆరోజు ఉదయం పదింటికి బెడ్ ఇస్తే లేడీ డాక్టర్లు మళ్ళీ సాయంకాలం ఆరింటికిగాని రోగిని చూడటానికి రాలే. ఈలోపల నేను నర్సు చుట్టూ తిరగ్గా ఇన్ని రంగునీళ్లు నోట్లో పోసింది. మందు అడుగుతే ఆ నర్సు అంటుందిగదా "ఆస్పత్రిలో అడుగుపెట్టగానే మందు కావాలంటారు. ఒక్కక్షణం ఊపిరాడనీయరు" అని. మరి ఆస్పత్రికి వచ్చింది మందుకోసంగాదూ, పోనీ ఆమె ఏదన్నా ఇతర పనిమీదఉండి మందియ్యటానికి విసుక్కుందా అంటే ఆమె అప్పటికి 8 గంటల నుంచీ ఎవరితోనో కుర్చీలో కూర్చొని దర్జాగా భాతాఖానీ కొడ్తున్నది. సాయంకాలం లేడీ డాక్టరు సీతను చూసింది. నేను ప్రక్కన నిల్చొని రోగలక్షణాలు చెపుతూనే వున్నాను. ఆమె నావంక చూసీ చూడనట్టు చూసిందేగాని, నేను చెప్పినవేమీ, ఆమె వినిపించుకొన్నట్టు లేదు. సరిగ్గా ఆమె అక్కడ బెడ్ ప్రక్కన నిల్చున్నది అరనిమిషం. నర్సు కేదో చెప్పింది. వెంటనే చరచరా ఇంకో పేషెంటు దగ్గరకు పోయింది, నేను నిర్ఘాంతపోయాను.

ఆరాత్రి బెడ్‌పాన్ ఖాళీ చెయ్యటానికి పాకీదాన్ని పిలుస్తే అది ఎంతసేపటికీ వినిపించుకోదే. ఏమిటీ గొడవ అని ప్రక్కరోగులను వాకబుచేస్తే, దానికేదో డబ్బులు పారేస్తేగాని మాట వినదన్నారు. సరే దానికేదో ముట్ట చెప్పాను. రెండుమూడురోజులు చూశాను. రంగునీళ్లు తప్ప సరియైనమందు ఇవ్వలేదు రోగికి ఆ రంగునీళ్లయినా వాళ్ళిష్టంవచ్చినపుడు, వాళ్లకి జ్ఞాపకంవచ్చినపుడు. నర్సుదగ్గరకెళ్ళి "అమ్మా ఇలా బాధగా వుంది" అంటే "నాకేం తెలీదు. ఆ డాక్టరును అడగండి" అంటూ సమాధానం చెప్పటానికే చీదరించుకొంటుంది. డాక్టరు చూతామా అంటే మన నోట్లోమాట నోట్లోవుండగానే వినకుండా వెళ్ళిపోతుంది. తీరా ఆరాతీస్తే లేడీడాక్టరుకుకూడా కొంత ముట్టచెప్తేగాని లాభంలేదని తేలింది. ఇటు చూద్దామా జ్వరం ఆనాటికానాడు హెచ్చటమేగాని తగ్గడం లేదు. బాగా ఆలోచించిన మీదటే ముప్పయిరూపాయలు ముట్టచెప్పాను డాక్టరుకు. డబ్బుముట్టిన మరుక్షణంనుంచీ రోగిని జాగ్రతగా చూడటం మొదలుపెట్టింది. ఏవో ఇంజక్షన్లు వ్రాసింది కొనుక్కురమ్మని. ఆస్పత్రిలోలేవా అంటే లేవంది. ఇంక చేసేదేముంది. డబ్బుపెట్టి మందులు కొన్నాను. ఇంక ఇంజక్షన్లు ఇవ్వడానికి నర్సుచీదరింపులు వినాలి. "డబ్బంతా కాజేసేది ఆమె చాకిరీమాది" అంటుందా నర్సు. టైముకు ఇంజక్షను ఇచ్చేది కాదు. నానాయాతన పెట్టేది. ఆమెకు ఓ పదిరూపాయలు ముట్టచెప్పాను. మొత్తానికి రోగికి సంబంధమున్న ప్రతిమనిషికీ రెండోమూడో ముట్టచెప్పాను. జ్వరంతగ్గి బయటపడేటప్పటికి ఎంతలేదన్నా వందరూపాయలు వదిలినయి. పోనీ డబ్బుతీసుకొన్నవాళ్లు కాసేపయినా మంచిగా వుంటారా అంటే అదీలేదు. డబ్బుముట్టిన మరునాటినుంచీ మళ్ళీ ఎడమొహం పెడమొహమున్నా. అందుకే మళ్లీ నాజీవితంలో ఆస్పత్రిమొహం చూడకూడదనుకున్నాను" అంటూ ముగించాడు సుబ్బారావు.

"అయితే ప్రభుత్వం ఇదంతా గమనించటం లేదంటావా?" అన్నా నేను.

"ఏమోమరి. అయినా లంచగొండితనం ఇప్పుడు ప్రతి డిపార్టుమెంటులో ఉన్నదేగా?" అన్నాడు సుబ్బారావు.

"అదికాదోయి. ఈ ఆస్పత్రులకీ, మిగతా

సర్కారు ఆఫీసులకీ తేడాలేదూ? ఆస్పత్రిలో రోగుల ప్రాణాలతోనా చెలగాటం? ఒకప్రక్క రోగి చావుబతుకులమీద వుండి సర్కారు ఆస్పత్రిగదా అని కొండంత ఆశతో వస్తే, వాళ్ళకు సరియైన వైద్యంచెయ్యక నానా అవస్థలు పెట్టి, లంచాలకు చేతులు చాపుతే, ఇంకా ఈ ఆస్పత్రులు దేనికి? ప్రభుత్వం వైద్యశాఖకి ఇంత డబ్బు ఖర్చుచెయ్యటం దేనికి? అదంతా బూడిదలో పోసిన పన్నీరులా వృధా కావాలిసిందేనా? ఆవేశంగా అన్నాను నేను.

అవునుమరి. ఈనాడు సర్కారు ఆస్పత్రి నిజ పరిస్థితి తెలిసిన ఎవరికయినా వీటివలన సామాన్య ప్రజలకు ఉపయోగం శూన్యం అనే ఉద్దేశ్యం కలగటం సహజం.

"పోనీ ఆ డాక్టర్లకు, నర్సులకు జీతాలు తక్కువ, చాలక బాధపడుతున్నారు అని అనుకుందామంటే డాక్టర్లకు దాదాపు మూడువందల రూపాయలు. నర్సులకు అందులో సగం ముట్టతయ్యే, ఇంకా వాళ్ళకు జీతాలు చాలక ఈ లంచాలకు దిగారంటే అర్థం లేదు" అన్నాడు సుబ్బారావు.

"అయితే ఈ ఆస్పత్రులకు ఖర్చు పెడుతున్న ప్రజల సొమ్మంతా యిలా పాడయిపోవలసిందేనా?" ప్రశ్నించాను నేను.

"అది స్వతంత్ర భారతదేశంలో నివసిస్తున్న స్వతంత్రం పౌరులమైన మనమే ఆలోచించాలి" అన్నాడు సుబ్బారావు.

తరువాత మేము చాలాసేపు అవీఇవీమాట్లాడుకొన్నాం. నేను ఇంటికి చేరుకొన్నాను. అప్పటికి పన్నెండు గంటలు కావచ్చింది. ప్రజలకు అవసరమైనప్పుడు ఉచితవైద్య సౌకర్యాలు ఎలాంటి ఇబ్బందులకు లోనుగాకుండా అందచేయటానికి తగిన మార్గాలను గురించి యోచించుకొంటూ నేను భోజన ప్రయత్నంలో నిమగ్నుడనయాను.

# లభించిన పారితోషికం

ముక్కామల కృష్ణారావు

రామంలో కథలు వ్రాయాలన్న ఉత్సాహం ఉబకడానికి కారణం "ఆమె" అని చెప్పక తప్పదు. "కథలు వ్రాయాలంటే చక్కటిఅమ్మాయి చిరునవ్వు మనసులో అహర్నిశలు మెదలాలోయ్" అన్న శశి మాటల్లోని గూఢార్థం రామానికి సమంజసంగా తోచింది. ఆమె చిరునవ్వుకై తహతహబడ్డం, తీయని కలలు కనడం రామంచేత కథలు వ్రాయించడం మొదలుపెట్టించాయని చెప్పాలి. అసలు కథలు వ్రాయడంలో ఒక విధానం ఉందని రామానికి తెలీదు. కాగితం మీద కలం పడగానే అతనిలోని భావాల తరంగాలు పొంగి పొరలేవి. తను వ్రాసిన కథలను చదువుకుని తనే మురిసిపోయేవాడు. అతని హృదయం పులకితమయ్యేది. పత్రికలో ప్రచురింపబడ్డాక కొన్నివేల పాఠకులు తన కథను చదువుతారు. ఆమెకూడ చదువుతుంది. తను ఆమె హృదయంలో మెదుల్తుంటాడు. ఆమె చిరునవ్వు తన హృదయంలో అమృతాన్ని వర్షిస్తుంది. ఆలోచనల పరంపరలో రామం మనసు ఉప్పొంగేది. ఆమె అతని హృదయంలో మెరపులా మెరసేది. ఆ మెరుపే అతనిలో ఉత్సాహమును ద్విగుణీకృతం చేసేది. మనసులో పొంచివున్న భావాలలో చలనం కలుగచేసేది. చలనంతో పాటు జీవితం హాయి అనిపించేది అతనికి. చూస్తున్న ప్రతీ వస్తువులో నూతనత్వం గోచరించేది. ఆమె సౌందర్యలహరి అతన్ని ఆనందములో ముంచివేసేది. ప్రకృతిలోని చల్లదనం అతన్ని పరవశుణ్ణి చేసింది. ఆమె తీయని పలుకులస్వరం, కిలకిల నవ్వులు అతన్ని మత్తెక్కించాయి. పల్చని తెల్లని వెన్నెలలో, జాజిమల్లి వాసనలతో మిళితమై వస్తున్న చల్లని గాలిలో తన్మయత్వంలో మునిగిపోయి, తీయని భావాలలో పొందబోయే భావి ఆనంద తరంగాలలో తేలిపోతూ ఎన్నో ప్రేమ గాథలను వ్రాశాడు రామం.

కాని హటాత్తుగా ఒకనాడు ఆమె అతని ముందునుంచి మాయమవడంతో రామం మనసులోని సున్నితభావాలు విప్లవంలోలా చెల్లాచెదరై నలుప్రక్కలా పరుగులుతీశాయి. తీయని తలుపులు అదృశ్యమయినాయి. అట్లాగని అతను విరహవేదనతో పిచ్చివాడవలేదు. ఆమెను ప్రేమి